ప్రజాశక్తి
గురువారం 11 డిసెంబర్ 2025
5
కర్నూలు

బాలోత్సాహం..!

- బాలోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- విజేతలకు బహుమతులు ప్రదానం
- ఘనంగా ముగిసిన పిల్లల పండగ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కలెక్టరేట్

కర్నూలు నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన ఐదో కర్నూలు బాలోత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. ఉదయం విద్యార్థులకు చిత్రలేఖనం, కథ చెప్పడం, తెలుగులో మాట్లాడడం, కార్టూన్ వేయడం, రైమ్స్ చెప్పడం, జానపద నృత్యాలు, కోలాటం, సంగీత వాయిధ్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. సాయంత్రం బాలోత్సవం అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. ఈ సభలో అమరావతి బాలోత్సవం నాయకులు స్వరూపారాణి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషితోనే బాలోత్సవం విజయవంతమైందని తెలిపారు. అమరావతి బాలోత్సవానికి కొత్తగూడెం బాలోత్సవం స్ఫూర్తి అని, ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 50 ప్రాంతాల్లో బాలోత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. పిల్లలను చదువుకే పరిమితం చేస్తున్నారని, ఏం చదవాలో కూడా తల్లిదండ్రులే నిర్ణయిస్తున్నారని, ఆటలు, సంగీతం వంటి ఆలోచనలు లేకుండా అణచి పెట్టేస్తున్నారని తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు పిల్లలను సిద్ధం చేసి తీసుకొచ్చారని, వారి ప్రోత్సాహం వల్లే బాలోత్సవాలకు మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. పాఠశాలల వద్దకు కూడా డ్రగ్స్ వస్తున్నాయని, పిల్లలు ఏం చేస్తున్నారో పెద్దలు గమనించకపోతే వారి భవిష్యత్తు శూన్యంగా మారుతుందని తెలిపారు. పిల్లల మేధస్సు పెంపునకు ఈ బాలోత్సవాలు నాంది కావాలని, ఈ కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని చెప్పారు. బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య మాట్లాడుతూ... బాలోత్సవం వల్ల పండగ వాతావరణం ఏర్పడిందన్నారు. చదువుతో పాటు ఏదో ఒక దానిలో నైపుణ్యం సంపాదించుకోవాలని, నైపుణ్యాన్ని పెంచుకున్న వారు గొప్ప వారయ్యే అవకాశం ఉందని తెలిపారు. బాలోత్సవానికి వచ్చిన వారందరూ పాఠశాలలో గెలిచి ఇక్కడికి వచ్చిన వారేనని, ఓడినా బాధపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించి ఎక్కువ మంది పాల్గొనాల్సిన అవసరం ఉందన్నారు. మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్ మాట్లాడుతూ... విజేతలకు, పిల్లలను కష్టపడి తీసుకొచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఇప్పుడు గెలవని వారు మరోసారి ప్రయత్నించి గెలవాలని కోరారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ మాట్లాడుతూ... పిల్లల్లో చాలా ప్రతిభ దాగి ఉందన్నారు. మార్కులను నైపుణ్యంగా చూడకుండా ప్రతిభను నైపుణ్యంగా చూడాలన్నారు. పాల్గొన్న అందరూ విజేతలేనని చెప్పారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్ భాను, ప్రయివేట్ విద్యాసంస్థల గౌరవాధ్యక్షులు పిబివి.సుబ్బయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల సిఇఒ విల్సన్, యునైటెడ్ ఇన్సూరెన్స్ సీనియర్ బ్రాంచి మేనేజర్ బి.నాగార్జున రెడ్డి, ఆర్థిక వేత్త మన్సూర్ రెహమాన్, వైద్యులు రాయపు రామచంద్రా రెడ్డి, రామగోపాల్ రావు, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, బాలోత్సవం కోశాధికారి జె.రంగస్వామి, ఉపాధ్యకులు ఎంసివి.రమణారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న అమరావతి బాలోత్సవం నాయకులు స్వరూపారాణి

విద్యార్థులు బహుమతులు అందజేస్తున్న పుల్లయ్య, అక్తర్‌భాను, సుబ్బయ్య

పశ్చిమ ప్రాంత వెనుకబాటుకు

పాలక పార్టీల వైఫల్యాలే కారణం

- సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు , రాష్ట్రం విడిపోయినప్పుడు, రాష్ట్రాన్ని పాలించిన పాలక పార్టీల వైఫల్యాలే కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం వెనకబడడానికి కారణమని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత జిల్లాల పునర్విభజన జరిగిన జిల్లాల్లో అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు జిల్లా అని, అలాంటి జిల్లా అభివృద్ధి కోసం జిల్లా నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులు, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించాడు. 2014లో ఆగస్టు 15న కర్నూలు నడిబొడ్డున ఎస్‌ఎపి క్యాంపు గ్రౌండ్ సాక్షిగా ఆరోజు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఈ జిల్లా అభివృద్ధినా ధ్యేయమని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేస్తానని ఆస్వాతంత్రం దినోత్సవ సందర్భంగా ఇచ్చిన వాగ్దానం నేటికీ నెరవేరలేదనీ తెలిపారు. రాష్ట్రంలోనే మొదటి మున్సిపాలిటీగా ఏర్పడిన ఆదోని ప్రాంతాన్ని రెండవ ముంబాయి పేరు ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో ఒక్కో పరిశ్రమ మూతపడుతున్నప్పటికీ వాటి నివారణ కోసం పాలక పార్టీలు ఏ మాత్రం ప్రయత్నం చేయలేదని ఆయన విమర్శించారు. తల మీదనే తుంగభద్ర నది ఉన్నప్పటికీ ఈ ప్రాంతంలో ఉన్న రైతాంగం, గ్రామీణ ప్రజలకు తాగడానికి, పంట సాగు చేయడానికి నీటి వనరుల కొరత ఉందంటే దానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం పరిశ్రమల ఏర్పాటు కోసం పాలక పార్టీల ప్రజాప్రతినిధులు తాము అధికారంలో ఉన్నప్పుడైనా ఈ ప్రాంతం అభివృద్ధి కోసం నిధులు తీసుకొని వద్దామనే ఆలోచన ఆవగింజంతయినా కూడా లేకపోవడంతో ఈ ప్రాంతం వెనకబడడానికి ప్రధాన కారణమనే విషయాన్ని ప్రజలు గమనించాలని సిపిఎం కోరుతున్నది. కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం ఈ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించడం కోసం సాగునీరు తాగునీరు జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కావాలని సిపిఎం అనేక దఫాలుగా పాదయాత్రలు చేసి పాలకవర్గాలపైన ఒత్తిడి తీసుకుని వచ్చిందని, ఆ వత్తిడి ఫలితంగా ప్రభుత్వాలు కొంత కదిలిక వచ్చినప్పటికీ వారికి చిత్తశుద్ధి లేకపోవడంతో ఆ సమస్యలన్నీ అలాగనే మిగిలిపోయాయని ఆయన తెలిపారు. 2005, 2008, 2023, 2025, సంవత్సరాలలో జిల్లావ్యాప్తంగా పాదయాత్రలు, జీపు జాతాల పేరుతో ఈ ప్రాంత అభివృద్ధి కోసం సిపిఎం ఉద్యమాలు చేసిందని, రాబోయే కాలంలో కూడా ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించడంపై పాలకులపై ఒత్తిడి తీసుకురావడానికి ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. కానీ ఈ ప్రాంత ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సిన పాలక పార్టీలే ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు రాబట్టడంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలని దాని ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధి జరుగుతుందని, ఈ ప్రాంతం వెనుకబడడానికి కారణం ఈ రాష్ట్రాన్ని ఏలిన పాలక పార్టీలేనని తెలిపారు. సాగునీరు, తాగునీరు, వలసల నివారణ, పరిశ్రమల ఏర్పాటు కోసం, జిల్లా అభివృద్ధికి నిధులు రాబట్టడం కోసం సిపిఎం కట్టుబడి ఉందని తెలిపారు.

ప్రశాంతంగా టెట్ పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోబుధవారం నుండి టెట్ పరీక్ష ప్రారంభమైంది. నగరంలోని అయాన్ డిజిటల్, దూపాడులోని కెవి.సుబ్బారెడ్డి ఐయాన్ డిజిటల్ కేంద్రాలలను జిల్లా విద్యాశాఖాధికారి స్. శ్యామ్యూల్ పాల్ సందర్శించారు. మొదటిరోజు 665 మంది అభ్యర్థులకు గాను 590 మంది హాజరయ్యారు. 75 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కాంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగింది. టెట్ పరీక్ష డిసెంబర్ 21 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ పరీక్షకు మండల విద్యాశాఖ అధికారులు ఆదాంబాష, వినోద్ కుమార్ , వనజ కుమారి లు డిపార్టుమెంట్ ఆఫీసర్లు పర్యవేక్షించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఎపి రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు జి సింగవరం సర్పంచి నారాయణ అధ్యక్షత వహించారు. జి. రామకృష్ణ మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగుకు ఎకరాకు రూ.25 వేల నుండి రూ.30 వేల వరకు ఖర్చు చేశారన్నారు. రైతుల పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. ప్రయివేటు వ్యాపారస్తులు అత్యంత తక్కువ ధరకు కొంటున్నారు. కేవలం రూ.1300 నుండి రూ.1500 వరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2450 ప్రకటించిందన్నారు. తప్ప ఎక్కడ అమలు చేయడం లేదన్నారు. ఒక క్వింటాల్ పైన రూ.900 పైగా నష్టపోతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధర రైతులకు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లాకలెక్టర్ సిరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర , రైతులు వీరన్న, నరేంద్ర, టి.వెంకటేశ్వర్లు, బి.సోమన్న, శ్రీనివాసులు, కాజపీరా పాల్గొన్నారు.

బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

-డార్మెటరీ, టాయిలెట్‌లలో శుభ్రత పాటించేలా చర్యలు -షాపుల్లో గడువు ముగిసిన వస్తువులు అమ్మరాదు
- ఎమ్మార్పీ ధరకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు -ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆర్‌టిసి బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కర్నూలు ఆర్‌టిసి బస్ స్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ లోని రిజర్వేషన్ కౌంటర్, టాయిలెట్స్, డార్మిటరీ, ఉచితతాగు నీరు, షాపులు, హోటల్స్, నిఘా అండ్ భద్రత విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. బస్ స్టాండ్ ఎంట్రన్స్ ప్రాంగణంలో పైకప్పు పెచ్చులు ఊడిపోవడాన్ని గమనించి, ప్రమాదాలు జరుగక ముందే త్వరితగతిన మరమ్మతులు చేపట్టి బాగు చేయించాలని కలెక్టర్ ఆర్‌ఎంను ఆదేశించారు. టాయిలెట్లను పరిశీలిస్తూ మెయింటెనెన్స్ బాగుందని, అయినప్పటికీ మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. టాయిలెట్ ఎంట్రన్స్ వద్ద డోర్ ఏర్పాటు చేయడంతో పాటు పెయింటింగ్ వేయించాలని కలెక్టర్ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర డార్మిటరీ నిర్వహణ సరిగా లేదని, కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్ కండక్టర్లకు సంబంధించిన ఎర్నింగ్ సెక్షన్ రికార్డు రూమ్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, నీటిని తాగి చూశారు.. తాగునీటి కేంద్రం వెనుకభాగం నుండి చెడు వాసన వస్తోందని గమనించిన కలెక్టర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎంను ఆదేశించారు. బస్‌స్టాండ్ పరిసరాల్లో ఉన్న షాపులు, హోటళ్లను కలెక్టర్ పరిశీలించారు. షాపుల్లో అమ్ముతున్న వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు వంటి ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై గడువు తేదీలు ఉన్నాయో లేదో కలెక్టర్ తనిఖీ చేశారు. గడువు ముగిసిన వస్తువులను అమ్మడం, ఎంఆర్‌పి ధర కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షాపు యజమానులను గట్టిగా హెచ్చరించారు. హోటల్‌లో అల్పాహారం చేస్తున్న ప్రయాణికులతో మాట్లాడారు. అధిక ధరలకు అమ్మిన పక్షంలో కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. డిపోలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది డ్రైవర్లు మద్యం సేవించారా లేదా అనే దాని బ్రీత్ అనలైజర్ ద్వారా క్షుణ్ణంగా చెక్ చేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు.. డిపో ప్రవేశద్వారం వద్ద మ్యాన్‌హోల్ తెరిచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే దాన్ని మూసివేయడంతో పాటు పరిసరాల్లోని డ్రైనేజ్‌ను తక్షణమే శుభ్రం చేయించాలన్నారు. డీజిల్ నిల్వ, డీజిల్ సాంద్రత , ఉష్ణోగ్రతను స్వయంగా పరిశీలించారు. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా ప్రజలకు ఏ విధంగా లాభం చేకూరుతుందో తెలుసుకునేందుకు కలెక్టర్ కర్నూలు - నంద్యాల సర్వీస్ బస్సులోకి ప్రవేశించి ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఎం శ్రీనివాసులు, డిపో మేనేజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

నన్నూరు సచివాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

సకాలంలో విధులకు హాజరు కావాలి

-జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశించారు. బుధవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ సచివాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో మూమెంట్ రిజిస్టర్, హాజరు పట్టిక తదితర కార్యాలయ సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాన్ని కూడా ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడిలో నిర్వహణ, పిల్లలకు అందుతున్న ఆహారం, పోషణ ప్రణాళికల అమలుపై సమగ్రంగా పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. సిపిఎం కల్లూరు మండల కమిటీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం సూర్యనారాయణ భవనంలో కె.మధు అధ్యక్షతన నిర్వహించారు. డి.గౌస్ దేశాయ్, మండల కార్యదర్శి ఎ.కృష్ణ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి నుంచి ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చే దుర్మార్గమైన బిజెపి ప్రభుత్వం కార్మికులకు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు లేకుండా చేస్తుందన్నారు. వేతనాల పెంపు కోసం సమ్మె చేసే హక్కు లేకుండా యాజమాన్యానికి మేలు కలిగే విధంగా దుర్మార్గంగా ఈ లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. ఈ కోడ్లకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. వీటన్నింటిపైనా విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ప్రజలకు కార్మికులకు మేలు కలిగే విధంగా జాతీయ మహాసభల్లో చర్చించారు. అంబానీ, ఆదానికి ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు మనం పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్షావలి, శ్రీనివాసులు, రాజశేఖర్, కోటి, మౌలాలి వివిధ గ్రామాల పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాశాంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న ప్రపంచ మానవ హక్కుల ప్రకటన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ప్రపంచమంతా మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్.రోషన్న , అధ్యాపకురాలు నాగరత్నమ్మ వైస్ ప్రిన్సిపల్ జె. హేమంత్, డాక్టర్ ఫక్రున్నీసా బేగం, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎ.వెంకటస్వామి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు

చంద్రబాబు మొండి వైఖరి వీడాలి

-పేదలకు విద్యా, వైద్యాన్ని దూరం చేయవద్దు
-వైసిపి నేతలు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆగ్రహం
-కోడుమూరులో కోటి సంతకాల పత్రాల ఊరేగింపు

ప్రజాశక్తి- కోడుమూరు

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలన్న మొండివైఖరిని ముఖ్యమంత్రి చంద్రబాబు వీడాలని వైసిపి నేతలు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ సూచించారు. పేదలకు వైద్యం, వైద్య విద్యను దూరం చేసి చరిత్రహీనుడిగా మిగిలిపోవద్దని హితవు పలికారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ కోడుమూరులో వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమం, కోటి సంతకాలు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. నియోజవర్గంలో సేకరించిన 60 వేల సంతకాల పత్రాలను ఇవాళ కోడుమూరు నుంచి భారీ ప్రదర్శనగా ప్రత్యేక వాహనంలో తరలించారు. పార్టీ నేతలు మాట్లాడుతూ..ప్రభుత్వమే దళారీగా మారిపోయి వైద్య సేవలు, వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం, విలువైన సంపదను ప్రయివేట్ వ్యక్తులకు దోచిపెడుతుండటం దుర్మార్గమన్నారు. అన్ని సదుపాయాలు, అనుమతులతో సిద్ధంగా ఉన్నా ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను సంతలో సరుకులుగా, పప్పు బెల్లాల మాదిరిగా చంద్రబాబు సర్కారు తెగనమ్మడం సరికాదన్నారు. అన్ని మండలాలు, పంచాయతీల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టామని, ఈ ప్రజా ఉద్యమంలో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మెడికల్ కాలేజీలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ సంతకాలు చేశారని తెలిపారు. ఇది తమ బిడ్డల ఉజ్వల భవిష్యత్తు, ప్రభుత్వ వైద్య రంగాన్ని పరిరక్షించుకునేందుకు తలపెట్టిన ప్రజా ఉద్యమంగా వారు అభివర్ణించారు. అక్టోబరు 10న ప్రారంభమైన కోటి సంతకాల సేకరణ గత రెండు నెలలుగా రచ్చబండ కార్యక్రమం ద్వారా ఉధృతంగా సాగిందని పేర్కొన్నారు. ఈ నెల 15 నాటికి జిల్లా కేంద్రాల నుంచి తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయానికి కోటి సంతకాలను ర్యాలీగా తరలించనున్నామన్నారు. ఈ నెల 17న అధినేత వైఎస్.జగన్ మోహన్ రెడ్డి, పార్టీ పెద్దలు ఈ కోటి సంతకాలను గవర్నర్‌కు అందిస్తారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ శ్రేణులను వారు అభినందించారు.కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ పరిశీలకులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్, జడ్‌పిటిసి రఘునాథ రెడ్డి, వైసిపి మం డలఅధ్యక్షులు రమేష్ నాయుడు, కృష్ణారెడ్డి , లాయర్ ప్రభాకర్, వైసిపి ఎస్‌సి ఎస్‌ల్ అధ్యక్షులు సురేష్, ఎంపిటిసి శీను, ఉప సర్పంచి మాధులు, లింగన్న, సోమన్న, హనుమంతు, రాఘవేంద్ర, కరుణ, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిమూలపు సతీష్

హెల్మెట్ ధరించకుంటే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేదంటే చర్యలు తప్పవని కర్నూలు ట్రాఫిక్ సిఐ ఎన్. మన్సూరుద్దీన్ తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని పూలబజారు, రాజ్‌విహార్ కూడలిలో హెల్మెట్ దారుణపై తన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వారిని ఆపి హెల్మెట్‌ను అప్పటికప్పుడే ధరించేలా చర్యలు తీసుకొని తాత్కాలికంగా రూ.185 ఫైన్ వేసి పంపారు. దరించకుండా వాయిదా వేసిన వారికి అక్కడికక్కడే రూ.1000 జరిమానా తో పాటు చలాను కట్టించి, కౌన్సిలింగ్ చేసి పంపించారు. ఆయన మాట్లాడుతూ... హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల వారి నుంచి తప్పించుకుని ప్రాణాపాయస్థితి నుంచి బయటపడేందుకు అధిక అవకాశాలు ఉంటాయన్నారు. పోలీసుల కోసం, ఫైన్‌ల కోసం హెల్మెట్‌ను ధరించడం కాకుండా ప్రతి ద్విచక్ర వాహనదారుడు తన బాధ్యతగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. హెల్మెట్‌ను ధరించకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. ధరించనిచో రూ.1000 జరిమాను విధిస్తామన్నారు. ఈ డ్రైవ్‌లో 110 కేసులు నమోదు చేసి రూ.20 వేల పైన జరిమానా విధించామన్నారు.

వైసిపిలో చేరింది టిడిపి కార్యకర్తలు కాదు : టిడిపి

ప్రజాశక్తి- సి బెళగల్

కంభదహాల్ లో టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరారని వచ్చిన వార్తలు అవాస్తవమని టిడిపి కార్యకర్తలు కాదని మండల టిడిపి నాయక బృందం బుధవారం తీవ్రంగా ఖండించింది. ఎన్‌టిఆర్ పార్కులో మండలంలోని టిడిపి నాయకులు ఈరన్నగౌడ్, కన్వీనర్ చంద్రశేఖర్, ధనుంజయ, యాకోబు, అమర్, సత్యారెడ్డి, గోండే రాముడు తదితరులు భారీ స్థాయిలో పాల్గొని పలువురువిమర్శలు కురిపించారు. సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అభివృద్ధి పనులలో, ప్రజాపాలనకు క్షేత్రస్థాయిలో దగ్గరవుతున్నారని పేర్కొన్నారు. ఇది జీర్ణించుకోలేని వైసిపి జిల్లా, ప్రాంతీయ నాయకులు గ్రామాల కార్యకర్తలకే టిడిపి రంగు పూసి వైసిపిలోకి భారీగా చేరికలంటూ కంభదహాల్ వైసిపి కార్యకర్తలు ఉత్తిత్తి ప్రచారాలతో బల ప్రదర్శనకు పూను కుంటున్నారని ఎద్దేవా చేశారు. వైసిపి వచ్చే సాధారణ, సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగో రానించలేదన్నారు. టిడిపి విజయాలను ఎవరూ ఆపలేరనిదీమా వ్యక్తం చేశారు.

బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

బాల్య వివాహాలను నిర్మూలించాలి

- కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, పోలీస్, విద్య, మున్సిపల్, పంచాయతీ రాజ్, డిఆర్‌డిఎ తదితర శాఖల జిల్లా అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అంగన్వాడీ సూపర్వైజర్లు తదితరులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి వంద రోజుల జాతీయ ప్రచారంలో మూడు దశల్లో నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అన్ని సంక్షేమ వసతి గృహాలలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ, కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో, వసతి గృహాల్లో బాల్యవివాహాలకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలని కలెక్టర్ డిఇఒ, ఆర్‌ఐఒలను ఆదేశించారు. జిల్లాలో క్రిష్ణగిరి, దేవనకొండ, ఎమ్మిగనూరు రూరల్ ప్రాంతాల్లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిని అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కుటుంబ-సామాజిక ప్రభావాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ ద్వారా బస్సులు, అన్ని వాహనాలపై పోస్టర్లను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బాల్య వివాహాల నివారణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, ఐసిడిఎస్ పిడి విజయ, డిటిసి శాంతకుమారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జుబేదా బేగం, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన, ట్రైబల్ వెల్ఫేర్, అధికారి, సిడిపిఒలు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎస్‌ఇకి 14 ఫోన్ కాల్స్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌పిడిసిఎల్ కర్నూలు విద్యుత్‌సౌధ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్‌ఇ కార్యక్రమానికి 14 ఫోన్ కాల్స్ వచ్చాయని ఎస్‌ఇ ఆర్.ప్రదీప్ కుమార్ తెలిపారు. కరెంట్ బిల్లులకు సంబంధించి నాలుగు, ఓల్టేజ్ ఎక్కువ తక్కువ రావడం గురించి ఒకటి, సరఫరా ఆగిపోవుట గురించి ఒకటి, కొత్త సర్వీస్ కావాలని ఒకటి, ఇతరములు 7 మొత్తం 14 ఫోన్ కాల్స్ వచ్చాయని చెప్పారు. చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయడానికి అధికారులను ఆదేశించారు. ఆర్థికపరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇంజనీరు విజయభాస్కర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

కూటమితోనే అభివృద్ధి

- టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బంటుపల్లి, బేతపల్లి, బండపల్లి గ్రామాల్లో నూతన గ్రామ సచివాలయాల నిర్మాణాలకు భూమి పూజ, చెల్లెల చెలిమల గ్రామంలో 'ఇంటింటికి టిడిపి' నిర్వహించారు. ఆయా గ్రామాల్లో టిడిపి నాయకులు వెంకట స్వామి గౌడ్, నాగేంద్ర గౌడ్, శ్రీనివాసులు గౌడ్, సర్పంచి చిన్న రామప్ప పూల వర్షం కురిపించి ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనేక ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పి.కోటకొండ గ్రామం నుంచి లక్కసాగరం వరకు నూతన రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4.7 కోట్లు మంజూరు చేసిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి నాయకులు కలిసికట్టుగా పనిచేసి ఎంపిటిసి, సర్పంచులను కైవసం చేసుకోవాలన్నారు. ఎంపిడిఒ జ్యోతి, డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్, పిఆర్ ఎఇ ఉదయ్ కుమార్, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, కర్నూలు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి గుండ్లకొండ రామదాసు గౌడ్, టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, మల్లెపల్లి రంగడు, టిడిపి నాయకులు ఉల్పీరప్ప, బడిగింజల రంగన్న, రామారావు నాయుడు, రాజశేఖర్ గౌడ్, రాజా సాబ్, కక్కర శరత్ కుమార్, కోటకొండ రామలింగడు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న వైకుంఠం జ్యోతి, బొజ్జమ్మ

సర్పంచికి అగౌరవం : గ్రామానికి ప్రథమ పౌరుడు సర్పంచికి గ్రామంలో జరిగిన సభ వేదికపైకి ఆహ్వానం లేకపోవడంతో చేతులు ముందు పెట్టుకుని నిలబడిపోయారు. బేతపల్లి గ్రామంలో సచివాలయ నిర్మాణానికి భూమిపూజకు హాజరయిన టిడిపి ఇన్‌ఛార్జీ జ్యోతి, వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ బొజ్జమ్మ నిర్వహించిన సభలో సర్పంచి మహేశ్వరరెడ్డికి సభపైకి ఆహ్వానం లేక సభ ముందు నిలబడిపోయారు.

ఆదోని జిల్లా ఏర్పాటు చేసే వరకు పోరాటం

- కౌతాళం జెఎసి నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతాభివృద్ధికి ఆదోనిని జిల్లాగా ప్రకటించే వరకు కౌతాళం జెఎసి ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని జెఎసి నాయకులు మాదిరి మోహన్, శేష రెడ్డి, మున్నా సాహెబ్, దేశాయి చారి, లక్ష్మణాచారి, శ్రీనివాసులు, అవతారం, పాల్ దినకరన్, సుబ్బరాజు, సయ్యద్ మూద్ బాషా, రాజాబాబు తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జెఎసి ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ సంఘం, వ్యాపారుల సంఘం, విద్యాసంస్థల యాజమాన్య సంఘం, వివిధ ప్రజా సంఘాలు, ప్రతిభ హైస్కూల్, జెకెఎల్ఎస్ స్కూల్ విద్యార్థులతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్ఆర్, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ.... కర్నూలు జిల్లా కేంద్రానికి 130 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆదోని డివిజన్‌లోని పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, ఆదోని నియోజకవర్గాలను కలిపి జిల్లాగా ప్రకటిస్తే అభివృద్ధి చెందుతామన్నారు. విద్య, వైద్య, పరిపాలన పరంగా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలంటే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయా పార్టీల నాయకులు బుజ్జి స్వామి, వడ్డే రాముడు, సక్రె తిక్కయ్య, రాజా అష్రఫ్, కాశీ విశ్వనాథ్, సిద్ధు, రమేష్ గౌడ్, చౌదరి సోమన్న, విజయ్ కుమార్, భీమేష్, ఖాదర్‌బాషా, ఉమేష్, ఉపేంద్ర పాల్గొన్నారు.

కౌతాళంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

‘ఆదోని’ బంద్ సక్సెస్...

- నిరసనలతో అట్టుడికిన ఆదోని - పోలీసుల తీరుపై న్యాయవాదుల మండిపాటు
- పలువురు ఆందోళనకారుల అరెస్టు

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధన కోసం అన్ని వర్గాలూ ఏకమయ్యాయి. జిల్లా సాధనకు జెఎసి ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన ఆదోని బంద్ సక్సెస్ అయింది. చిన్న చిన్న ఘటనలు మినహా ఉదయం నుంచి సాయంత్రం వరకు బంద్ సాగింది. ఉదయం 5 గంటలకే ఆర్‌టిసి డిపో వద్దకు రాజకీయ పార్టీల నాయకులు చేరుకున్నారు. డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా ద్వారం వద్దే బైఠాయించారు. జిల్లాగా ప్రకటించాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, వన్‌టౌన్ సిఐ శ్రీరామ్ ఘటన స్థలానికి చేరుకున్నారు. బస్సులను వదలాలని పోలీసులు నచ్చజెప్పినా నాయకులు వినకపోవడంతో ఇరువురి మధ్య తోపులాట చోటు చేసుకుంది. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

పోలీసుల అత్యుత్సాహం : ఆదోని బంద్ సంపూర్ణంగా జరుగుతున్నా పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించడం సమంజసం కాదంటూ జెఎసి నాయకులు మండిపడ్డారు. అవసరం లేకున్నా కొందరిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి, భగ్నం చేసేందుకే కుట్ర పన్నారని విమర్శించారు. ముందస్తు చర్యగా పోలీసులు సీనియర్ న్యాయవాది నాగేంద్రయ్య, మహిళా సంఘం నాయకులు సుజ్ఞానమ్మ, నాయకులు తిరుమలేష్, ఉదయ్, వీరేష్, వెంకటేష్‌ను పోలీసు వాహనంలో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. దుకాణాలను మూసేసి వ్యాపారులు బంద్‌కు మద్దతు ఇవ్వడంతో వీధులన్నీ బోసిపోయాయి.

జెఎసి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

మున్సిపల్ మైదానం నుంచి ఆదోని పురవీధుల గుండా జిల్లా సాధన సమితి జెఎసి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్ రెడ్డి, ప్రకాష్ జైన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, జెఎసి నాయకులు రఘురామయ్య, లలిత కృష్ణమూర్తి, అశోక్ నంద రెడ్డి, దస్తగిరి నాయుడు, కోదండ, వీరేష్ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. జిల్లా సాధన ఘట్టం చివరి దశలో ఉందని, ప్రభుత్వం స్పందించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పోలీసుల తీరుపై న్యాయవాదుల మండిపాటు

జెఎసి నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరు సమంజసంగా లేదని సీనియర్ న్యాయవాది నాగేంద్రయ్య మండిపడ్డారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు నుంచి దీక్ష శిబిరం వరకు ప్రదర్శనగా చేరుకుని సంఘీభావం తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరాములు, జనరల్ సెక్రటరీ జీవన్ సింగ్, న్యాయవాదులు దేశాయ్ రామిరెడ్డి, మల్లికార్జున, తబ్రేజ్, నాగరాజు, మధు, సద్దాం, ప్రభాకర్ మద్దతు తెలిపారు.

టిడిపి, జనసేన సంఘీభావం

బంద్‌కు టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, ఉమాపతి నాయుడు, గుడిసె ఆది కృష్ణమ్మ, రేణు వర్మ, పులి రాజు బంద్‌కు మద్దతు ప్రకటించారు. అంతకుముందు పట్టణ వీధుల గుండా టిడిపి, జనసేన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. టిడిపి యువ నాయకులు మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, ఆరెకల్ రామకృష్ణ, వాల్మీకి వెంకటేష్, బసాపురం వెంకటేష్ ఉన్నారు.

వైసిపి మద్దతు : వైసిపి ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి, పట్టణ అధ్యక్షులు దేవా, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి బంద్‌కు మద్దతు ప్రకటించారు. భారీ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి హాజరై ముందుకు నడిచారు. వ్యాపార సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, శ్రీధర్, రమేష్ యాదవ్, దిలీప్ దొక, ఉద్యోగ సంఘాల నాయకులు మంజునాథ, భాస్కర్, ఉషా రాణి ఉన్నారు. నాయకులు సాయిరాం, ఫయాజ్, అహ్మద్, కోటి, నీలకంఠ, నాగరాజు గౌడ్, మధుసూదన్ శర్మ, పద్మనాభయ్య, మురళీ, ఎంఆర్‌పిఎస్ నాయకులు గిడ్డయ్య, బాలస్వామి, హనుమంతు, రామ్ భీం నాయుడు, బాలకృష్ణ, మల్లికార్జున, తిరుమలేష్, ఉదయ్ బంద్‌లో పాల్గొన్నారు.

25వ రోజు దీక్షలు : ఆదోని జిల్లా సాధనకు జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష శిబిరం 25వ రోజుకు చేరింది. పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు ఆనంద్ రాజు, శ్రీధర్ దీక్షకు కూర్చున్నారు.

మద్దతు తెలిపిన టిడిపి నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, గుడిసె ఆది కృష్ణమ్మ

నిజమైన కార్యకర్తలకు న్యాయం : టిడిపి

- రామదుర్గం సొసైటీ చైర్మన్‌గా కురువ లక్ష్మీకాంత్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలూరు నియోజకవర్గంలో నిజమైన టిడిపి కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి దంపతులకు ఆ పేరు దక్కుతుందని కురువ లక్ష్మీకాంత్ తెలిపారు. బుధవారం టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి శివప్రసాద్ ఆదేశాల మేరకు రామదుర్గం సొసైటీ చైర్మన్‌గా కురువ లక్ష్మీకాంత్, డైరెక్టర్లుగా పరమేష్, ముసలప్ప ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా డిసి అధ్యక్షులు నగరడోన కిష్టప్ప, బిల్డోన సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ కొండా పురుషోత్తం హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన లక్ష్మీకాంత్ ముఖ్య అతిథులకు పూలమాల, శాలువా వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ మాట్లాడారు. తన ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా వచ్చిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి అన్ని రకాలుగా సహకరించిన వైకుంఠం జ్యోతి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. వైకుంఠం జ్యోతి రావడంతోనే గ్రామాల్లో కార్యకర్తలకు న్యాయం జరగడమే గాక అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, పులికొండ, మాధవులు పాల్గొన్నారు.


రామదుర్గం సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న లక్ష్మీకాంత్

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సెంటర్ల నిర్వహణకు కొత్త ఫోన్లు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరు ప్రాజెక్టు సిడిపిఒకు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు పి.గోవిందు, ఎమ్మిగనూర్ ప్రాజెక్ట్ అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీలు సేవలందిస్తున్నారని తెలిపారు. అన్ని వస్తువుల ధరలు పెరుగుతున్నా 2019 నుంచి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదని చెప్పారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, హామీ అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 12న కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు. నాగ శిరోమణి, యుఎం.నాగలక్ష్మి, మున్ని, రామేశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

సిడిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

నియోజకవర్గం నుంచి 50 వేల సంతకాల సేకరణ

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గం నుంచి వైసిపి ఆధ్వర్యంలో 50 వేల సంతకాల సేకరణ చేపట్టి జిల్లా కేంద్రానికి పంపించామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఆయన మాట్లాడారు. సేకరించిన ప్రతి సంతకాన్నీ పూర్తిగా డిజిటలైజ్ చేసి, పారదర్శకంగా వైసిపి జిల్లా కార్యాలయానికి పంపిస్తున్నామని తెలిపారు. ఈ నెల 15న కర్నూలు జిల్లా కేంద్రం నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తారని చెప్పారు. 17న వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి గవర్నర్‌ను కలిసి ప్రజల అభిప్రాయాన్ని అధికారికంగా సమర్పించనున్నారని తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షులు దశరథరెడ్డి, పిఎ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆలూరు నియోజకవర్గం నుంచి 60వేల సంతకాల పత్రాలను విరుపాక్షి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి తరలించారు. ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఎమ్మెల్యే బి.విరుపాక్షి మాట్లాడారు. పేద విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన మెడికల్ కళాశాలను కార్పొరేట్ల చేతిలో పెడుతున్నారన్నారు. నియోజకవర్గంలో నగరడోన, వేదవతి రిజర్వాయర్లపై మాట్లాడలేదన్నారు. నాయకులు భాస్కర్ నాయుడు, కిట్టు, రాంగోపాల్, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఆలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు, గ్రామస్తులు

స్పీడ్ బ్రేకర్ వేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో జిల్లా పరిషత్ ఉన్నత దగ్గర స్పీడ్ బ్రేకర్ వేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు తరుణ్, విష్ణు కోరారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల ముందు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో రాయచూరు, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లే వాహనాలు అతివేగంతో వెళ్తుండడంతో విద్యార్థులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు దాటేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఆర్అండ్‌బి అధికారులే బాధ్యత వహించాలని చెప్పారు. మండల నాయకులు సోమనాథ్, సోమశేఖర్, రవి పాల్గొన్నారు.

ఆదోని బంద్‌కు మద్దతు

ప్రజాశక్తి - హొళగుంద

ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ఆదోని బంద్‌కు మద్దతుగా మండలంలోని ఎల్లార్తి గ్రామంలో సర్పంచి చాముండేశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టి మద్దతు తెలిపారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ... ఆలూరు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలు కలిపి ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. ఆదోని జిల్లా ప్రకటించే వరకు పోరాటం ఆగదని తెలిపారు. మహంతేష్, షేకప్ప, చిదానంద రవి పాల్గొన్నారు.

అక్రమ ఇసుక సీజ్

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ముద్దటమాగి గ్రామానికి చెందిన మల్లికార్జున అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సీజ్ చేసినట్లు ఎస్ఐ దిలీప్ కుమార్, ఆర్ఐ మహేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ... అందిన సమాచారంతో నిల్వ ఉంచిన ప్రదేశానికి వెళ్లి చూడగా అధిక మొత్తంలో ఇసుక నిల్వ ఉందని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఇసుక నిల్వ ఉంచినట్లు మల్లికార్జున తెలుపగా.. అక్కడ ఇంటి నిర్మాణం ఉన్న ఆనవాళ్లు కనబడకపోవడంతో ఇసుకను సీజ్ చేసినట్లు చెప్పారు. విఆర్ఒ నాగరాజు, సురేంజనేయులు పాల్గొన్నారు.

ఇసుక డంపును సీజ్ చేస్తున్న ఎస్ఐ

నివాళులర్పిస్తున్న నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

అనారోగ్యంతో మృతి చెందిన గుడిసె భీమయ్య కుటుంబానికి టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం భీమయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మట్టి ఖర్చులకు మృతుడు భీమయ్య కుమారుడు గుడిసె రాజుకు ఆర్థిక సహాయం అందజేసి అధైర్య పడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపిటిసి మేకల వెంకటేష్, టిడిపి సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి, ఆర్‌కె.రఘు, జడ్‌పి హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ నరసింహులు పాల్గొన్నారు.

కనులవిందు భరతనాట్యం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించిన భరతనాట్యం భక్తులకు కనులవిందు చేసింది. బుధవారం కర్ణాటక రాష్ట్రం కార్వార్ జిల్లా బికె.హళ్లికి చెందిన దుర్గా నాట్య కళా కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. శివాష్టకం, ఐగిరి నందిని, మహాగణపతి, శివ పంచాక్షరి వంటి భక్తి పాటలకు భరతనాట్యం చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ శ్రీశక్తి అశోక్ మైత్రి మాట్లాడుతూ... శ్రీమఠంలో నిర్వహించిన భరతనాట్యం 302వ కార్యక్రమమని తెలిపారు. అనంతరం కళాకారులకు శ్రీమఠం అధికారులు సర్టిఫికెట్ అందజేశారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న మఠం సిబ్బంది

ఈరన్న స్వామి హుండీ లెక్కింపు

- రూ.83.71 లక్షల ఆదాయం

హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.83,71,517 వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. బుధవారం స్వామివారి 32 రోజుల హుండీని లెక్కించినట్లు చెప్పారు. స్వామివారికి రూ.83,71,517తో పాటు బంగారం 55 గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 9 కిలోల 810 గ్రాములు భక్తులు సమర్పించుకున్నట్లు తెలిపారు. హుండీ పర్యవేక్షణ అధికారి బి.సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రిలే దీక్షకు మద్దతు ఇవ్వాలి

- వైసిపి నేత ప్రదీప్ రెడ్డిని కోరిన బిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆదోని జిల్లా సాధనకు చేపట్టనున్న రిలే నిరాహార దీక్షకు మద్దతు ఇవ్వాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డిని బిఎస్ఎస్ నాయకులు స్వామినాథం కోరారు. బుధవారం ఎమ్మిగనూరులోని భీమా నిలయంలో ఆయనను కలుసుకొని సంఘీభావం తెలిపాలని కోరారు. బిఎస్ఎస్ పార్టీ, ఆదోని సాధన సమితి జెఎసి అధ్వర్యంలో ఈనెల 12 నుంచి మంత్రాలయంలో చేపట్టనున్న రిలే దీక్షకు వైసిపి నుంచి మద్దతు కోరేందుకు వచ్చామని, దానికి ఆయన సానుకూలంగా స్పందించారని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సౌలభ్యం కోసం ఆదోని జిల్లా సాధించే వరకు ఉద్యమాలలో భాగస్వాములు కావాలని కోరామన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలోని అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన ఎర్రగోటి అంజి రూ.50,116 విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. అయ్యప్ప స్వామి మాల ధరించిన అయ్యప్ప స్వాములకు, శివ స్వాములకు మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహారం కూడా ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బంగారు బంగారు రాజశేఖర్ అభివృద్ధి పనులకు రూ.10,016 ఇచ్చారు. జడ్‌పిటిసి కిట్టు పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న ఎర్రగోటి అంజి

కోటకొండ, బేతపల్లి రోడ్డుకు నిధుల మంజూరుపై డివైఎఫ్ఐ హర్షం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో అధ్వానంగా ఉన్న కోటకొండ-బేతపల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల డివైఎఫ్ఐ మండల కమిటీ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, కె.శ్రీనివాసులు మాట్లాడారు. మూడు మండలాలను కలిపే ప్రధానమైన రోడ్డు ఈదులదేవరబండ నుంచి బేతపల్లి, బండపల్లి, లక్కసాగరం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అభివృద్ధిలో రవాణా సౌకర్యం ఒకటని, రవాణా సౌకర్యం అనువుగా ఉన్నప్పుడే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గతంలో డివైఎఫ్ఐ మండల కమిటీ మండలంలోని రోడ్ల దుస్థితిపై దశలవారి ఆందోళనలు, పోరాటం నిర్వహించినట్లు తెలిపారు. కప్పట్రాళ్ల నుంచి బండగట్టు రోడ్డు, దేవనకొండ జిల్లేడు బుడకల, కప్పట్రాళ్ల రోడ్డు పల్లెదొడ్డి, వెంకటాపురం నేలతలమర్రి రోడ్డు, పుల్లాపురం నుంచి తెర్నేకల్ వరకు కరివేముల, తెర్నేకల్ రోడ్డు, కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారి నుంచి పొట్లపాడు వరకు గుండ్లకొండ, బేతపల్లి వరకు రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. వీటికి మరమ్మతులు, కొత్త నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు కెబి.నాగేంద్ర, తెర్నేకల్ నాగేంద్ర, అనిల్ కుమార్, వీరేంద్ర నాయుడు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

మహారాజశ్రీ పత్తికొండ సివిల్ (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.146/2023 in O.S.No.95/2022
Between:
దనియాల వెంకటప్ప. ...డిక్రీహోల్డర్
-Vs-
ముస్టూరు శ్రీరాములు. ...జడ్జిమెంట్ డెబిటర్
వేలం నోటీసు
పైన తెలిపిన అమలు అర్జిని డిక్రీ హోల్డర్, జడ్జిమెంట్ డెబిటర్ నుంచి తనకు రావలసిన దావా మొత్తము ఈ క్రింద చూపిన ఆస్తులను వేలము వేసి రాబట్టుకొనట కొరకు దాఖలు చేసియున్నారు. పై తెలిపిన కోర్టులో 30-12-2025 తేదిన ఉదయం 10.30 గం॥ల నుండి క్రింద చూపిన కోర్టువారి షరతులకు లోబడి వేలము జరుపబడును.
షెడ్యూలు
కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసు, జిల్లా సబ్-రిజిస్ట్రార్ పత్తికొండ, మద్దికెర మండలం, మద్దికెర ఉత్తరం రెవెన్యూ గ్రామం చెందిన ఆస్థి వివరములు:
సర్వే నెం.296-4 ఎ.4.27 సెంట్లు ఇందులో ఎ.1.00 సెంట్లు
చెక్కుబంది : తూర్పు : చెన్నకేశవ స్వామి చేను
పడమర : అంజినేయులు, బసవరాజు భూములు
ఉత్తరం : ముస్టూరు శ్రీరాములు భూమి
దక్షిణం : మస్టూరు గోపాల్
వేలము జరుగు తేది : 30-12-2025
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
డిక్రీ హోల్డర్ విలువ : రూ.1,13,480/-
మార్కెట్ విలువ : రూ.1,50,000/-
అమీనా విలువ : రూ.8,00,000/-
పి.యల్లారెడ్డి,
డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది
పత్తికొండ, కర్నూలు జిల్లా.
సెల్ : 9885855502.

యువత క్రీడల్లో రాణించాలి

- మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్
- ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నందవరం

యువత క్రీడల్లో రాణించాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్ తెలిపారు. బుధవారం మండలంలోని సజీవపురంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతను ప్రోత్సహించడానికి క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొంటున్నాయన్నారు. విమర్శలకు వెళ్లకుండా స్నేహభావంతో ఆడాలని, యాజమాన్య నిబంధనలను పాటించాలని క్రీడాకారులకు సూచించారు. జనవరి 3న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని తెలిపారు. గెలుపొందిన జట్టుకు రూ.25,016, రన్నర్‌కు రూ.15,016 బహుమతి ఇస్తామన్నారు. ఈనెల 13న పూలచింత, 20న నందవరం గ్రామాల్లో టోర్నమెంట్లను నిర్వహిస్తామని తెలిపారు. గజేంద్రారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, ఆదిశేషు, సోమన్న, హేజ్ ఖేల్, నజీర్, చాకలి మల్లికార్జున, శాతర్ల నరసింహులు, సోడా షాప్ వీరేష్, తెలుగు ఈరన్న, చాకలి వెంకటేష్, పంపయ్య పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న మాధవరావు దేశాయ్

పబ్లిక్ నోటీసు
ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమసంస్థ యొక్క అనుబంధ సంస్థ)
రి.నెం. ABC - CS/006/2015
H.O: ABCCS, Endowments Commissionerate Campus, Gollapudi, Vijayawada-521225, Phone: 0866-6650300. 2413524
B.O: ABCCS, H.No: 87-45, Arora Nagar Road, Sri Lakshmi Nagar, Kurnool -518002.
ఈ ప్రకటనలోని వారి తాలుకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్థిపై సొసైటీ నందు తనఖాపెట్టి సొసైటీ నుంచి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖాపై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోపుగా లిఖిత పూర్వకముగా అభ్యంతరములను రిజిస్టర్ పోస్ట్ విత్ ఏక్ నాలెడ్జ్ మెంట్ ద్వారా మా బ్యాంకుకు తెలియ పరచవలసినదిగా కోరుతున్నాము.

Sl.NO.	Applicant Name & Address	Description of the property
1	Sri.Garudatri Venkata Dattatreya Sharma, GL No. 85421 S/o. Garudatri Venkata Subramanyam. Cell : 9704045160/7288851219	The property which is an extent of 146.66 Sq.Yards of house site along with RCC Roofed Ground and First Floor residential building threin, in R.S.No :290C & 294, Door No:4/366/30, Ward No.4, Asst No. 1015017583 situated at Mangaraya Anjaneya Temple area, Sri Kota Mangaraya Nagar Society, Adoni -518301, Kurnool District, Andhra Pradesh. Value Rs. 50.27 Lakhs
Kurnool 08.12.2025		Branch Manager B.Prabhakar Cell:92810 29471/ 9398166575

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల వార్షికోత్సవం

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు పట్టణంలో విభిన్నప్రతిభవంతుల 66వ అంతర్జాతీయ వార్షికోత్సవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయుడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లప్ప హాజరయ్యారు. ముందుగా కోట్ల కూడాలిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి వికలాంగులు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విభిన్నప్రతిభవంతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. గత ప్రభుత్వం వికలాంగులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. వికలాంగులకు బస్సులో ఉచిత ప్రయాణం, రాజధాని అమరావతిలో వికలాంగుల భవనం, దివ్యంగులకు వ్యాపారం చేసుకోవడానికి బ్యాంక్ ద్వారా ఆర్థిక సహాయం, వికలాంగుల ఫించన్ ఆరు వేలు ఇలా అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వం దివ్యంగులకు అండగా ఉంటుందని దీంతో కూటమి ప్రభుత్వానికి వికలాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వికలాంగులకు బ్యాటరీ వాహనాలు ఇచ్చిందని వికలాంగ ఉద్యోగులలో కోట ఏర్పాటు చేసిందన్నారు. టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, టౌన్ అధ్యక్షుడు గంగాధర్ నాయుడు, టిడిపి నాయకులు బ్రిటీషు రాముడు, ఎల్లప్ప నాయుడు, ముడుమలగుర్తి మల్లేష్, బడేసా గౌడ్, రవి గౌడ్,శీలం కృష్ణ, జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం కోడుమూరు మండల కమిటీ మండల అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, సోమేశ్వరి, రుబీనా టిడిపి దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు మద్దిలేటి, చనుగొండ్ల పద్మావతి, పుల్లన్నరంగయ్య, డీలర్ కృష్ణ, రవి, బలరాం, మునిస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో తొలి రిచెస్ట్ అండ్ ప్రీమియం కమ్యూనిటీ అనంత ఫిలింనగర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని ఎన్ హెచ్ 44 హైవే సమీపాన సమ్మర్ స్టోరేజ్ దగ్గర తొలి రిచెస్ట్ అండ్ ప్రీమియం కమ్యూనిటీతో అనంత ఫిలింనగర్ సిద్ధంగా ఉందని మేనేజర్ సురేష్ తెలిపారు. తమ దగ్గర కష్టమైసేడ్ విల్లా ప్లాట్స్, పండ్ల చెట్లతో, సువాస భరితమైన పూల చెట్లతో, హెర్బల్ గార్డెన్స్ తోకలవని తెలిపారు. కస్టమర్ లక్షరీప్లాట్స్‌లో 5.62 సెంట్లు నుండి 11.25 సెంట్ల వరకు ఏదైనా ప్లాట్‌ని ఎంచుకోవచ్చని, ఫార్మ్ ల్యాండ్ ప్లాట్స్ లో 1/4 నుండి 1/2 ఎకరా 20 కి పైగా కోరుకున్న పండ్లు , పూలు హెర్బల్ గార్డెన్‌తో ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. తమ కస్టమర్స్‌కు ప్రత్యేకమైన ఫీచర్స్ ఇస్తున్నామని అందులో భాగంగా అవుట్డోర్ ఎమినిటీస్ లో కిడ్స్ ప్లేఏరియా, అవుట్డోర్ జిమ్, టెన్నిస్ కోర్ట్, యోగాటెక్, టాప్‌క్లాస్ సిసి రోడ్స్, సిసిటివి కెమెరాస్ ,మాస్టర్ కాంపౌండ్ వాల్ ,24/7 సెక్యూరిటీ ,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, బ్యాట్మెంటన్ కోర్టు, జాగింగ్‌ట్రాక్, సోలార్ ఫెన్సింగ్ మొదలగునవి ఇస్తున్నామని పేర్కొన్నారు. వీటితోపాటు క్లబ్ హౌస్ అండ్ రిసార్ట్‌ని కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. క్లబ్ హౌస్‌లో ఎలిగేంట్ ఏరియాస్, స్టేట్‌ఆఫ్‌దఆర్ట్ ఫిట్నెస్‌సెంటర్, ఈవెంట్ స్పేస్, ఇండోర్ గేమ్స్ ఉంటాయని తెలిపారు. తమ వెంచర్లో ప్రత్యేకమైన ఫ్యూచర్స్ గురించి తెలుపుతూ తమ వెంచర్ కర్నూలు మున్సిపాలిటీ పరిధిలో ఉందని, 100శాతం వస్తూ కలిగి ఉందన్నారు. బస్టాండ్‌కు కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండి, వెంకటరమణ కాలనీ కేవలం రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉండి, భూకంపాలకు తట్టుకునే విధంగా సైట్‌కి అయిదు అడుగుల కింద గ్రానైట్ స్టోన్ ఉందని, తమ వెంచర్ దగ్గర్లో ఫిలిం ఇండస్ట్రీహబ్, ఫిలింస్టూడియోస్ షూటింగ్స్, కాటేజ్ రిసార్ట్స్, అమ్యూజ్‌మెంట్ పార్క్స్, వాటర్‌గేమ్స్, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ప్రపోజల్‌లో ఉన్నాయన్నారు. 24 గంటలు తాగునీటికి ఆటంకం ఉండదని తెలిపారు. ఇలాంటి ఉత్తమమైన ఫ్యూచర్స్ కలిగిన వెంచర్లో విల్లా ఫ్లాట్స్ లేదా ఫార్మ్లాన్ ప్లాట్స్ కొనాలని ఆసక్తి కలవారు తమ ఆఫీస్ శ్రీ లక్ష్మీ స్కూల్ ఎదురుగా క్రీం స్టోన్ బిల్డింగ్ సెకండ్ ఫ్లోర్లోకు వచ్చి కలవవచ్చని తెలిపారు.

ఎన్‌టిఆర్ స్మారక సేవా వార్డు అందుకున్న హనుమంతరావు చౌదరి, పి. లక్ష్మి పద్మా చౌదరి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖపట్నంలో ప్రసన్న కల్చర్ సొసైటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన అవార్డులలో నందమూరి తారక రామారావు కళా, సేవ అవార్డు గ్రహీతలు అయిన పి.హనుమంతరావు చౌదరి, పిలక్ష్మీ పద్మా చౌదరిలను అవార్డు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ప్రసన్న ఆరూహి, జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, విల్సన్, నిమ్మగడ్డ పావని, మొదలగువారి ఆధ్వర్యంలో వారిసంస్థ సభ్యులచే అవార్డు సన్మానించారు. హనుమంతరావు చౌదరి మాట్లాడుతూ నందమూరి తారకరామారావు అంటే మాకు ఎంతో ప్రాణం అందుచేతనే విశాఖపట్నంలో అవార్డు రావడం సంతోషమన్నారు. ఈ అవార్డు కళాకారులతో కళా సేవ చేయడానికి నన్ని ఇంకా ప్రోత్సహిస్తుందని నా మీద బరువు బాధ్యతలు పెరిగాయని, గత ఆరు నెలల నుండి ఆరోగ్యం బాగాలేక కళాకారులతో కలవలేక హైదరాబాదులో వైద్యం చేయించుకున్నటువంటి తాను ఇప్పుడు కళాకారులతో అందరితో, కలిసి కళా సంస్థలతో కలిసి కళాసేవ చేస్తానని కళాకారులకు మంచి గుర్తింపు ఉందని కళాకారుల బాధలు కళాకారు కోసం, సహాయ సహకారాలు ,అందించమని కోరుతానని తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్‌టిసి డ్రైవర్ శ్రీనివాసులు

-ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు బాధితులకు అందజేత

ప్రజాశక్తి- వెల్దుర్తి

ఆర్‌టిసిలో పనిచేస్తున్న డ్రైవర్ నిజాయితీ చాటుకున్న ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. వివరాల మేరకు చెరుకులపాడు గ్రామానికి చెందిన చాకలి రామాంజనమ్మ పాలకుర్తిలో మంగళవారం జరగబోయే దేవరకు వెల్దుర్తిలో కోడుమూరుకు వెళ్ల బస్సు ఎక్కారు. వెంకటగిరి కోడుమూరు మధ్యలో నూతన రోడ్డు వేస్తు వేస్తుండడంతోడం బస్సు వెంకటగిరిలో ప్రయాణికులను దించింది. రామాంజనమ్మ పాలకుర్తికి వెళ్ళిన తర్వాత చూసుకోగా తనతో పాటు తెచ్చుకున్న బంగారు ఆభరణాల బాక్స్ కనపడలేదు. బస్సులో పడిపోయాయని భావించిన బాధితురాలు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు అందజేశారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి బస్సు డ్రైవర్ డోన్ డిపోలో వెళ్ళేటప్పుడు చెక్ చేయగా ఒక బాక్స్ దొరికింది. దీనిని డిపోలో తనిఖీ అధికారులకు ఇచ్చి వెళ్లారు. డిపో మేనేజర్ వెల్దుర్తి పోలీసులకు సమాచారం చేరవేశారు. బుధవారం బాధితురాలని పిలిపించి బంగారం అప్పగించారు. నిజాయితీతో వ్యవహరించిన బస్ డ్రైవర్ శ్రీనివాసులు, ఎస్ఐనరేష్‌ను బాధితులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సిపిఎం రైతు సంఘం జిల్లా నాయకులు సూరి, మార్కండేయులు, సిఐటియు కర్నూలు ఆర్‌టిసి 2 డిపో యూనియన్ కార్యదర్శి బజారి పాల్గొన్నారు.

అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలి

- కోడుమూరులో సిపిఐ ఆధ్వర్యంలో రైతుల ధర్నా

ప్రజాశక్తి -కోడుమూరు

అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఒక్కో ఎకరానికి రూ.50వేల పంట నష్టపరిహారాన్ని రైతులకు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో రైతులు డిమాండ్ చేశారు. బుధవారం కోట్ల సర్కిల్లో సిపిఐ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి రాజు అధ్యక్షతన రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిసిఐ ద్వారా పత్తి పంటను క్వింటాలుకు రూ.12 వేల చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. పత్తి పంటకు సిసిఐ పెట్టిన నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాల వల్ల రైతులు పంటలు పండగ తీవ్రంగా నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయారని కాబట్టి బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని రాజు డిమాండ్ చేశారు. రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వంపై రైతులు తిరగబడక ముందే వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఎఐటియుసి తాలూకా కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు, ఆటో యూనియన్ నాయకులు మధు రైతులు పాల్గొన్నారు.

రైతుల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు రాజు

మాట్లాడుతున్న ఎడిఎ మోహన్ విజయకుమార్

వేరుశనగ పంటకు జిప్సం తప్పనిసరి

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వేరుశనగ పంటకు పూత దశలో ఎకరానికి 200 కేజీల చొప్పున జిప్సం తప్పనిసరిగా వాడాలని ఎడిఎ మోహన్ విజయ్ కుమార్ తెలిపారు. వేరుశనగ పంటలో జిప్సం వేయడం వల్ల గింజలోని నూనె శాతం పెరిగి పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా రైతుకున్న పొలంలో డిమాండ్ ఆధారిత , కాలానికి అనుగుణంగా వివిధ పంటలను సాగు చేయాలని రైతులను కోరారు. రైతులు పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలని, సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా రైతులు లింగాకర్షణ బుట్టలు జిగురు అట్టలు , వేప నూనె పిచికారి వంటి పద్ధతులను పాటించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.అక్బర్‌బాషా, పోలీస్ కానిస్టేబుల్ యూసుఫ్, వ్యవసాయ విస్తరణ అధికారి, అజయ్ భార్గవ్, విఆర్‌ఒ వెంకటేశ్వర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తనూజా, రైతులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఆదోనిని తక్షణమే ప్రభుత్వం జిల్లాగా ప్రకటించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుల రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మదాసికురువ సుంకన్న, విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు రంగముని నాయుడు డిమాండ్ చేశారు. నగరంలోని స్థానిక ఆర్‌విపిఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతమైన ఆదోని ప్రస్తుతం కర్నూలు జిల్లాలో ఉందని కర్నూలు జిల్లా కేంద్రానికి ఆదోని , చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చేరుకోవాలంటే వందకు పైగా కిలోమీటర్ల దూరం ఉందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నారని ప్రభుత్వం దీనిపై తక్షణమే స్పందించి ప్రజల అభిప్రాయాల మేరకు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నాయకులు రాము, రాజేంద్రప్రసాద్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

11న రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాష్ట్ర పురుషుల బాక్సింగ్ పోటీల కొరకు జిల్లాలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షులు సురేష్ గౌడ్, ఛైర్మన్ పి.విజయ్ కుమార్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కర్నూల్ లోని అవుట్ డోర్ స్టేడియంలో ఈనెల 11న ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీలలో19 నుంచి 40 సంవత్సరాల లోపువయసు వారు, పుట్టిన తేదీ 2006 నకు ముందుగా జన్మించిన వారు ఈ పోటీల్లో అర్హులని తెలిపారు. జిల్లా స్థాయి లో ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులు డిసెంబర్ 13, 14 వరకు విజయవాడలోని లయోల కాలేజీలో నిర్వహించే సీనియర్ బాక్సింగ్ రాష్ట్రపోటీలలో పాల్గొంటారని వివరించారు. ఆసక్తిగల జిల్లా బాక్సర్స్ ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనాలని వారు తెలిపారు. వివరాలకు నిర్వహ కార్యదర్శి జగదీష్‌ను 9063012013 సంప్రదించాలని వారు కోరారు.

సెపక్‌తక్రా ఫెడరేషన్ అధ్యక్షునిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిల భారత సెపక్ తక్రా అసోసియేషన్ అత్యవసర సర్వసభ్య సమావేశంలో మన జిల్లాకు చెందిన జి శ్రీనివాసులను ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ అత్యవసరస మావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్యదర్శులు పాల్గొని శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుండి ఐదు సార్లు జాతీయ స్థాయి పోటీలు నిర్వహించి అలాగే అనేకమార్లు సౌత్‌జోన్ పోటీలు నిర్వహించిన కారణంగా గత 25 సంవత్సరాల నుండి సెపక్‌తక్రా అభ్యున్నతికి జాతీయస్థాయిలో ఈ క్రీడను అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషిచేసిన కారణంగా తనకు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో తన ఆధ్వర్యంలో ఈ క్రీడను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ మూడేళ్లలో మన రాష్ట్రంలో ప్రభుత్వ సహకారంతోనే అంతర్జాతీయ పోటీలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తానన్నారు. జి. శ్రీనివాసులు ఎంపిక పట్ల జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల నాయకులు క్రీడా అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.